కన్నీరు

భూపతి

అసురసంధ్యవేళ కన్నీరు పెట్టకూడదు...

ఈ సంగతి సుశీలకి తెలియనిది కాదు. ఆమె విషాదజీవితానికి, తరగని కన్నీటికి, తీరని ఆవేదనకు ఆ పట్టింపులేమీ లేవు. మిగిలినది, చెయ్యగలిగినది కన్నీరు కార్చడమే అయినప్పుడు అంతకన్నా చేయగలిగిందేముంటుంది!!

సుశీల భారంగా నిట్టూర్చి, కన్నీటిని చేత్తో తుడుచుకుంది. ఆమె దృష్టి చేతులమీదికిమళ్ళింది.

“—సుశీలా—నీచేతిలో అమృతం ఉంది సుమా!” అన్న భర్త మాటలు గుర్తుకు వచ్చాయి. ఆమెమనసు కొన్ని సంవత్సరాలు వెనక్కి లాగింది.

—హార్మోనియం ముందు కూర్చుని తను సంగీతం పాడుకుంటుంటే—ఎవరో ఒక వ్యక్తి, రోజూ తన ఇంటి ముందు, గుమ్మం ముందు తారట్లాడుతూండే వాడు. కొన్నాళ్ళు చూశాక తనకి అనుమానం వచ్చింది. ఆ రోజు తను సంగీతం పాడుకుంటుంటే అతనువచ్చి నేరుగా గుమ్మం ముందు నిలబడ్డాడు. తనకి కోపం పైకెగి పోయింది. పాట ఆపి, వచ్చిన కోపాన్ని దిగమింగుకుంటూ, “ఎవరండీ, ఏంకావాలి?” అని అడిగింది. అతనికి ఏంకావాలి? ఏమీ చెప్పలేక, 'ఎవ్వ—

ఏమ్యీ లేదూ—కొంచెం మంచి నీళ్ళు కావాలి—దాహంవేస్తోంది'' అని అడిగాడు. తను అతనికేసి పరీక్షగా చూసింది. మామూలు ఎత్తు—గ్లాస్కో చొక్కాలోంచి కనిపిస్తున్న కండలు తిరిగిన శరీరం జనపాలు—కలకత్తా చెప్పులు— పోస్టాలు లక్షణంగానే ఉన్నా— తనకెందుకో అలాగనిపించలేదు. మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. గ్లాసు అందుకునేటపుడు అతను తనకేసి, తనచేతులకేసి చూసిన చూపు— ఆనక కాలవగట్టు పక్కనున్న చెట్టుకింద రాయిమీద కూర్చుని—తను ఆ దారివెంట వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు చూసిన చూపులు — నెల తిరిగే లోపున తేలింది..... అదే వ్యక్తిముందు పెద్దల సమక్షాన తను గొంతెత్తి —— 'అదే' కృతి అతను కోరింది— పాడింది— పెద్దలూ పెద్దలూ శుభం అనుకున్నారు. ముప్పై ఎకరాల మాగాణీ ఉన్న ఆసామి ఇట్టే వచ్చి అట్టే ఒప్పుకున్నాడు — సుశీల ఎంత అదృష్టవంతురాలో అనుకున్నారు జనం— ఔను అప్పటిలో తనూ అలాగే అనుకుని మురిసి పోయింది.

... సుశీల చిన్నగా నిట్టూర్చి, గదిదాటి పెరట్లోకి వచ్చి—మల్లె పందిరి పక్క మంచం వాల్చుకుని కూర్చుంది.

"నిండు పూర్ణిమ—విరబూసిన మల్లెలు"

— "మల్లెలు" అనుకుంది సుశీల మల్లె పూలని అప్యాయంగా చూస్తూ... ఇవే మల్లె పూలు ఆ నాడు తన జడ నిండా అలంకరించారు. పెళ్ళి కూతుర్ని చేశారు చాలా పెళ్ళిళ్ళు చూసిన తను (ఆ రోజుల్లో) పెళ్ళికూతుళ్ళకు— "అంత సిగ్గు దేనికి? సరిగ్గా కూర్చోలేరు? రాజులా, రోజులా నిబ్బరంగా ఉండలేరా? పీటలమీద ఎందుకలా మెలికలు తిరిగి పోతారు?" అనుకుంది— కానీ అలా అలా ఎందుకు మెలికలు తిరుగుతారో తన కిప్పుడు బోధపడింది. తనూ అంతే చేసింది. ఆ ఆలోచన వల్ల తన ముఖం మీద చిరునవ్వు వెలిసింది. అది పసిగట్టి—పక్కింటి సుగుణ—"ఏమమ్మా! అంత హొయలు—ఎందు కా నవ్వు? ఇక్కడే అంత అందం చూపించక—ముందుంది సమయం" అని హాస్యం చేసింది. తనకేం మాట్లాడాలో తెలీక, "పోవే, నువ్వు మరీను" అంది. మామూలు సమయాల్లో అయితే తను మాటకి మాట అంటించగలదు.

సుశీల మంచంమీంచిలేచి వెళ్ళి సెరడంతా ఒక్కసారి తిరిగివచ్చి మళ్ళా మంచంమీద కూర్చుంది. దూరంగా ఎక్కడనుంచో బాజాలు వినబడ్డాయి. "పెళ్ళి బాజాలు గామోలు" అనుకుంది—ఆమె మనస్సు పెళ్ళి బాజాలవైపు లాగింది.

—పెళ్ళి బాజాలు ఉన్నట్టుండి ఆగిపోయాయి. ఆ గోల ఆగడానికి కారణమైన ఒక గొంతు విరుచుకు పడింది. ఆహూతులందరూ శ్రోతలై ఆ కంఠం సొంతదారునికోసం చూశారు.

"వీల్లేదు—అనుకున్న ప్రకారం అన్నీ జరిగి తీరాల్సిందే!" అన్నాడా కంఠం సొంతగారు. ఆ కంఠం సుపరిచితమైన దవడంవల్ల తను—తల ఎత్తే నవసరం లేకుండానే గ్రహించింది.

"పెళ్ళికొడుక్కి ఏమౌతాడో ఆయన" అన్నారు. కొందరు పెళ్ళిళ్ళలో అభాసు చేసేది మగ పెళ్ళి వారే అన్న స్థిర నిశ్చయంతో, ధీమాతో.

"పెళ్ళి కొడుక్కి ఏమీకాడు. పెళ్ళికూతురు మావయ్యట—" అన్నారు అప్పటి కప్పుడే వాకబు చేసినవారు.

"కుదర్దు— మేమిస్తామన్న కట్నం ఇవ్వాలా! గోళ్ళూడగొట్టి మరీ పుచ్చుకున్నారే! చిన్నమొత్తు బంగారం తక్కువయినాసరే ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు" అన్నా డాయన. తన పక్కన మంగళసూత్రం చేత్తో పట్టుకుని నిలబడ్డ 'ఆయన'కు కోపం వచ్చింది. దాన్ని అక్కడ పారేసి పీటదిగి, జనంలో కలిసిపోయారు. తనకి శరీరం పట్టుతప్పింది. కళ్ళు చీకట్లు కమ్మినట్లు అయ్యింది. ఇంతలో ఒకాయన ఆపద్బాంధవుడిలా పరుగున వచ్చి—ఆయన్ని, తన మావయ్యని శాంతపరచి, ఆనక ఒకావిడ దగ్గరకెళ్ళి, ఆవిడ మెళ్ళో నెక్లసు, చేతి గాజులూ తీసుకుని, తన మావయ్య చేతిలో పెట్టారు. ఆయనే పెళ్ళికొడుకు అన్నగారు అని ఎవరో అంటున్న ముక్కలు తనకి లీలగా వినిపించాయి.

"మాంగల్యం తంతు......" సవ్యంగానే జరిగింది. బావగారికి తను మనస్సులో వేయి నమస్కారాలు చేసుకుంది.

మిగతా శుభకార్యాలు పైయేటికి అని పెద్దలనడంవల్ల తను పుట్టింట్లోనే ఉండిపోవలసి వచ్చింది. ఉన్న ఎకరం పొలం అమ్మి తన పెళ్ళికి కట్నంగా యిచ్చినదానికి బదులుగా వచ్చిన నగలను భద్రంగా తన తల్లి దాచింది. సంవత్సరం తిరిగొచ్చేలోగా తన అన్న నరసింహారావు పట్నం చదువు మధ్యలో ఆపి ఏడుపుముఖంతో తిరిగి వచ్చేశాడు. అతను అలా రావడం ఎవరికీ ఆశ్చర్యం కలిగించక పోయినా, ఆనందం కలిగించలేదు. చదువు ఆపి, వచ్చిన అన్నగార్ని పలకరించడానికి తనకి ధైర్యం చాలలేదు. పైగా అన్నయ్య కోపిష్టి అని తనకి భయం కూడాను. ఆ సాయంత్రమే మామయ్య వచ్చాడు. వస్తూనే పొద్దున నుంచీ చర్చలేక పడున్న విషయాన్ని బయటకు లాగి, "ఛీ—ఛీ— ఇన్నాళ్ళ చదువూ ఇలా బూడిదపాలైతే ఎలారా గాడిదా" అన్నాడు. అన్నయ్య విసుక్కున్నాడు. డబ్బులేందే సుద్ధ ఉచితంగా భోజన సదుపాయాలతో సహా అడ్డమైన వాళ్ళకి చదువు చెప్పించే అంత ఉదారస్థితికి, దేశం ఇంకా రాలేదన్నాడు. అలాంటి అవకాశం వస్తే—తను అప్పటికి బ్రతికుంటే తప్పక చేర్తానన్నాడు. తను ఆ మాటలన్నీ తన గదిలోంచే వింది. ఆనక తన తల్లీ—మేనమామా ఏవేవో గుసగుస లాడుకున్నారు, తన కవి వినిపించలేదు. ఆనక, "పోయిందేమిటి? అడుగుదాం—" అన్నమాట, వెనువెంట "సుశీలా! ఓసారిలా రావమ్మా" అన్న పిలుపు వినపడింది. తను లేచి వాళ్ళ దగ్గర కెళ్ళింది. మావయ్య చెప్పవలసినదంతా టూకీగా చెప్పి—"నువ్వేం భయపడ నక్కర్లేదు—ఉత్తినే చేతి మార్పిడి—నువ్వు కాపరానికి వెళ్ళేలోగా నీ సొమ్ము నీతోనే ఉంటుంది. పైగా వాడేవడూ కాదు. నీ సొంత అన్నయ్యే కదా" అన్నాడు. తనకి ఏమని సమాధానం చెప్పాలో తోచలేదు. ఆలోచించుకోడడానికి తనకు అవకాశమూ, ఆశక్తి కూడా లేవు. అన్నయ్య తనకేసి ఒక్కసారి చూసి పక్క గదిలోకి వెళ్ళిపోయాడు. మేనమామా, తల్లీ తనని వూదరగొట్టారు. పర్యవసానంగా తన చేతులతో తనే—పెళ్ళినాటి అవాంతరంతో అడ్డుపడి, బావగారు తన భార్య చేతుల మంచి తీసిచ్చిన గాజుల జత—మావయ్య చేతులో పెట్టింది. ఆరోజే అన్నయ్య వెళ్ళిపోయాడు. వెళ్ళేటపుడయినా తనతో ఒక్కమాట చెప్పలేదు. తన మనస్సు చివుక్కుమన్నమాట నిజమే. కాని, అతని తత్వమే అంతని సరిపెట్టుకుంది. నెలకో ఉత్తరం, దానికి సమాధానంగా ఒక నగ చొప్పున అన్నయ్య చదువు సాగింది.

వేసంగు లొచ్చాయి. అన్నయ్య రాలేదు. పట్నంలో ఉద్యోగం దొరికిందని అతను రాసిన కార్డు మాత్రం వచ్చింది. మిగిలిన శుభకార్యాన్ని పూర్తిచేసుకుని, అమ్మాయిని తీసుకువెళతాం అని వాళ్ళు కబురు చేశారు. ఆనాడు అమ్మ నెత్తీ నోరూ బాదుకుంది. మామయ్య అట్టే ఆలోచించి ఏదో సాకుచెప్పి—పై సంవత్సరానికి శుభకార్యాన్ని వాయిదా వేయించాడు. ఆ సాకు ఏమిటో తన కిప్పటికీ తెలియదు. ఎవరూ చెప్పలేదు కూడాను. పైయేడు గిర్రున తిరిగి వచ్చింది. మళ్ళీ కబురు వచ్చింది. మావయ్య పట్నం వెళ్ళొచ్చి నట్టింట్లో గయ్యిన లేచాడు. అన్నయ్యని నోటి కొచ్చినట్టు తిట్టాడు. పర్యవసానం—అన్నయ్య తన దగ్గర చిల్లిగవ్వ కూడా లేదన్నాడని చెప్పాడు.

"ఇప్పుడేం చెయ్యాలి" అంది అమ్మ గాభరాగా.

పక్కగదిలోంచి వింటున్న తనకు ఏంచెయ్యాలో తెలీకపోయినా, ఏమవుతుందో మాత్రం చక్కగా తెలిసింది. అత్తారు పెట్టిన నగలు వాడుకుని అగచాట్లుపడ్డ—పక్కింటి సుగుణ (లాంటివాళ్ళ) చెప్పగా తను వింది. ఆ గతి తనకే వచ్చిందని ఆ రాత్రంతా కంటికీ మింటికీ ఏకధారగా ఏడ్చింది. మామయ్య ఏం లోపాయకారీ పని చేశాడో నగలన్నీ సిద్ధంగా ఉన్నాయని కబురు పెట్టాడు. "అంత డబ్బు నీ కెక్కడిదిరా అని తన తల్లి అడిగితే "దొంగతనం చేశాను. ఎక్కడిదైతే నీ కెందుకు— ఏం ఆమాత్రం ఓ నెక్లెసు, రెండు జతల గాజులూ—ఏదో ఇంకో టేమిటి—ఆమాత్రం నగలు తెచ్చే అంత డబ్బులేనివాణ్ణా" అని విసుక్కున్నాడు. మావయ్య తనకోసం అంత త్యాగం చేస్తాడని తను వూహించలేదు. "ఏమయితేనేం—నా నగలు నా కొచ్చాయి అదే చాలు" అనుకుంది తను ఆనందంగా.

—వూహాలోకంలో ఉన్న సుశీల తల్లి పిలుపుకి ఉలిక్కిపడి—"ఆ వచ్చే వచ్చే" అంటూ గమ్మున వెళ్ళి తలుపు తీసింది. రత్తమ్మగారు కూతురు ముఖంచూసి, "ఏం తల్లీ—ఎందుకలా మనస్సు బాధపెట్టుకుంటావు—మంచి రోజులు ఎప్పటికీ రాకనే పోతాయా ఎవర్ని ఏం లాభం? నా చేతులారా నేనే నీకు అన్యాయం చేశాను" అంటూ కంట తడి పెట్టుకుంది. తల్లి మనస్సును నొప్పించినందుకు సుశీల బాధపడింది. "లేదమ్మా—ఒంటరిగా కూర్చుంటే దిగులనిపించింది." అంది పూడిన గొంతుతో.

రత్తమ్మగారికి తన కూతురు గుణం తెలియక పోలేదు. ఇతరుల మనస్సు నొప్పించకూడదనే బుద్ధి కలది తన కూతురని తెలుసు. "నాకు తెలీదా తల్లీ—నీ నూరేళ్ళ జీవితాన్ని నా చేతుల్తో నేనే నాశనం చేశాను. ఈనాడు ఎవర్ని ఏం లాభం—పదమ్మా కొంచెం ఎంగిలిపడుదువుగాని" అంటూ కన్నీళ్ళు తుడుచుకుంటూ వంటింటికేసి నడిచింది.

సుశీల వెంగిలిపడి తన గదిలోకి వెళ్లి మంచం మీద కూర్చుంది. ఎదురుగా గోడకి పెళ్లినాటి పటం వేళ్లాడుతోంది. పటంమీద సాలెపురుగు గూడు కట్టుగోడానికి పథకం ఏర్పాటు చేసుకుంటోంది. సుశీల లేచి, సాలెపురుగును విదిలించి పటాన్ని కొంగుతో తుడిచి, పటం వంక తేరబారి చూడసాగింది.

కన్నీరు

"ఆయన వంగి, తన మెళ్లో మాంగళ్యం కడుతున్నారు."

సుశీల తన మంగళసూత్రాన్ని కళ్ల నద్దుకుంది.

—ఆవేళ రాత్రి .... సుశీలా, నీ చేతిలో అమృతం ఉందిస్మీ—అన్నారు. తన చేతిని ఆప్యాయంగా పట్టుకుని. "ఏదీ అమృతం" అంది తను చేతిని తిరగా, బోర్లా వేసి చూసుకుంటూ. ఆయన ఫక్కున నవ్వుతూ "చేతిలో అంటే బయట చూసుకుంటావేం—" అన్నారు తనని దగ్గరగా లాక్కుంటూ.

అత్తారింటికి వెళ్లిన మొదటి రోజుల్లో తనకి

బిన్‌టెక్స్ చేనేత బట్టలు. అనేక డిజైనులలో రంగులలో నమూనాలలో లభిస్తాయి

బిన్‌టెక్స్ చేనేతబట్టలు నమ్మకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే విశిష్టమై కసగూడా దిగని రంగు వేయబడ్డ నూలుతో బిన్నీవారు తమ నిర్ణయాలకు అనుగుణంగా తయారయేటట్టు చూస్తారు.

బిన్‌టెక్స్ చేనేత బట్టలను, అనుమతితో ఈ సైను బోర్డును ప్రదర్శించే బిన్నీ మిల్ స్టాకిస్టులవద్దకొనండి.

WE STOCK

BINNY'S FABRICS

BINNY & CO LIMITED, MADRAS

బిన్నీ & కంపెనీ, లిమిటెడ్ మద్రాసు

సుందరమైన రంగైన మధుర చీరలు

అందాలు చిందే కోయంబత్తూరు చీరలు

JWT/BY/BX-2722

చాలా భయంగా ఉండేది. పైగా ఆయన తెల్లవారుఝామున లేచి, కసరత్తు చేసేవారు. కసరత్తు చేసేవాళ్ళకు గుండె ఉండదని, కసాయితనం జాస్తి అని చిన్నప్పుడు కథల్లో అమ్మమ్మ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చేవి. అప్పుడవి నమ్మినా, ఆయన్ని చూశాక అవన్నీ శుద్ధ తప్పనిపించాయి.

ఆయన కసరత్తు చేస్తారనీ, కుస్తీలు పడతారనీ గిట్టనివాళ్ళంటే, తాగుతారనీ—ఇంకా .... అని అని, అన్నీ చెడ్డగుణా లుండడంవల్లే—అయిన వాళ్ళు— మేనరికాలు ఒదులుకున్నారనీ— గిట్టని వాళ్ళు అనేవారు. నీలాటిరేవులో తనలాటి మాటలు చాలా విన్నా, తేలిగ్గా నవ్వేసేది. ఆయన తన నెప్పుడూ చెడ్డగా చూడలేదు. పల్లెత్తుమాట అనలేదు—

సుశీల లేచి, లైటార్పేసి, నిద్ర కుపక్రమించింది.

నిద్ర— వెధవనిద్ర వస్తే బావుణ్ను—కాని, అదెందుకు వస్తుంది ? రాదు—పాపం—అమ్మ .... అమ్మని బాధపెట్టకూడదు—అసలే పెద్దకాలం— అన్నయ్య చదువుకుని, ప్రయోజకుడౌతాడని ఆశ పడింది. అయ్యాడు. కానీ, అయినవాళ్ళకు కాలేదు. దానికి అమ్మేం చేయగలదు.... నగ అమ్మమని ప్రోత్సాహం చేసిన మామయ్య కూడా మాట పట్టింపుతో మాట్లాడ్డం మానేశాడు—అమ్మకి ఉన్నది తనొక్కర్తే .... తనకున్నది ?!

సుశీల నిద్రపట్టక, పక్కమీంచి లేచి లైటువేసి, తన పెట్టె తీసి, భద్రంగా దాచిన ఒక ఉత్తరం తీసి, మళ్ళీ చదువుకుంది .... అవే ముక్కలు ప్రతి అక్షరంలోనూ పంతం, ఔదార్యం కనిపిస్తున్నాయి. ఉత్తరం పూర్తిగా చదివి, దాచేసి, లైటార్పి పక్క మీద కూర్చుంది. ఆమె మనస్సు మళ్ళీ గతంలోకి చొచ్చుకుపోయింది.

—ఆరోజు .... ఛ, ఆరోజు రాకపోయినా బావుండేది. వచ్చినా, తను పేరంటానికి సిద్ధం అవక పోయినా పోయేది .... హ్హు. విధి రాత తప్పించ గలిగింది ఎవరు .... పేరంటానికి తను తెమిలే లోగానే పక్కింటి విశాలాక్షమ్మగారు వచ్చింది. పేరుకుతగ్గ కళ్ళు — వస్తూనే— 'గమ్మున తెమ లమ్మడూ' అంటూ టేబులుమీదున్న నెక్లసు తీసి చూస్తూ "ఎన్ని కాసులే పిల్లా యిది" అంది. అప్పుడే లోపలకు వస్తున్న అత్తగారు ఎన్ని కాసులో చెప్పింది. విశాలాక్షమ్మగారు ఆమాట వింటూనే ఆశ్చర్యపోయింది. పోవటంతో ఆగక, నెక్లసు అన్ని కాసు లుండదని సవాలు చేసింది. మరోక్షణం నెక్లసుని పరీక్షగా చూసి "ఇదసలు బంగారమేనా" అని అడిగింది. ఆమాటకి తను ఉలిక్కిపడింది. అత్తగారు గయ్యిమంటూ ఆవిడ చేతిలోంచి నెక్లసు తీసుకుని, తిరగా బోర్లా వేసి చూసింది. ఆవిడ ముఖం రంగులు మార్చుకుంది పెద్దకోడలు లక్ష్మిని కేకేసి, "పెళ్ళినాడు నీ ఆయన నీ మెళ్ళోంచి తీసిచ్చిన నెక్లెసు యిదేనా" అని అడిగింది. లక్ష్మి నెక్లెసును అటూ యిటూ తిప్పి "ఛ" అంది గమ్మున.

సాయంత్రం దాటి దీపాలు పెట్టే వేళకల్లా తన నగలలో గిల్టు నగలెన్నో కంసాలి పాపారావొచ్చి అధికారపూర్వకంగా తెలియజేశాడు. తన శరీరం భయంతో వణికిపోయింది. ఆనాడు మావయ్య చేసిన పని తనకు గుర్తు వచ్చింది. గదిలో కూర్చుని, భయంకర భవిష్యత్తును తలుచుకుంటూ వెక్కి వెక్కి ఏడ్చింది. రాత్రి పొలం నుంచి వచ్చిన 'ఆయన్ని' పిలిచి, అత్తగారు జరిగిన విషయమంతా చెపుతుండగా తను చెవులారా వింది. మరి కాస్సేపటికి ఆయన తన గదిలోకి వచ్చారు. వస్తూనే గది విరిగేలాగ, "ఏం సుశీలా—అమ్మ చెప్పిందంతా నిజమేనా" అన్నారు. తను నోరెత్తి మాట్లాడేలోగా తన చెంప చెళ్ళుమంది. వరసన రెండు మూడు పడ్డాయి. ఆనక "చచ్చ" అనుకుంటూ ఆయన వెళ్ళిపోయారు. రెండు వారాలైనా నిండని తన దాంపత్యజీవితానికి ఆవిధంగా సొద్దు పడింది. ఆ రాత్రంతా తను కన్నీటితోనే గడిపింది. తెల్లవారుతూనే ఇంట్లో పంచాయితీ ఏర్పాటయ్యింది. ఎవరికి తోచిన ముక్కలు వాళ్ళు చెప్పారు. "ఏమైనా సరే ! నగలు తిరిగి యిచ్చితీరాలి. నగలు పాడుకున్నదే గాక, గిల్టు నగలు పెట్టి పంపుతారా ! ఎంత దగా !" అన్నారాయన. తన అత్తగారూ అదేమాటంది. "నగలన్నీ తెచ్చిస్తేగాని, అమ్మాయిని ఏలుకోడం కుదర్దని" తన తల్లికి, మామయ్యకీ కబురు పెట్టారు. రాత్రికల్లా మామయ్య వచ్చాడు; వస్తూనే విరుచుకుపడ్డాడు.

"కట్నం క్రింద మే మిచ్చిన డబ్బు మీరు మీ యిష్టం వచ్చినట్లుపయోగించుకోలేదూ ? ఏదీ ! ఆ డబ్బిలా తెండి చూద్దాం—అలాగే మేమూ ప్రాణావసరానికి ఆ నగలు మేంఉపయోగించుకున్నాం. ఎటొచ్చీ కాస్త కాలూ చెయ్యీ కూడగట్టుకున్నాక బంగారం నగలే చేయిచ్చేస్తాం—ఈలోగా పెట్టుకో డానికి ఉండవని బోలెడు ఖరీదు పోసి కొన్నాను. బంగారం అయితే వంటికి అంటుతుందా, ఇది అంటకపోతుందా ఏమిటి— ఈమాత్రం దానికి అమ్మాయిని ఏలుకోమని కబురు చెయ్యాలా— తెలీకడుగుతాను—అసలు మీవాడికి పెళ్ళయిందని ఆనందించడానికి పోయి, ఇదో ఇది కూడానా— వదిలేస్తాడట—వదిలేస్తాడు. అసలు పిల్లనివ్వ సాహసించింది ఈ చుట్టుపక్క ఊళ్ళల్లో ఎవరు ? మేం ఇచ్చాం తప్ప—" అంటూ జలస్నానం ఆడాడు. దాంతో ఆయన తోకతొక్కిన తాచులా లేచారు. మాటలు సరిహద్దులు దాటి చేతులు కలిపేదాకా వచ్చాయి. పంతాలు ఎక్కువయిపోయాయి. "బంగారం అంతా లెక్కగా యిచ్చేదాకా—అది ఈ గడప తొక్కడానికి వీల్లేదు" అన్నారాయన — తల్లి మాటను బలపరుస్తూ. మావయ్య ఇంకా ఇంకా రెచ్చిపోయాడు. పర్యవసానంగా తన పెట్టె, బేడా—ఆవేశంలో ఆయన విసిరేసి, "ఇదిగో, నగ లన్నీ లెక్కగా ఇవ్వడమే గాకుండా—క్షమార్పణ చెప్పుకుంటేగాని ఈ గడప తొక్కలేవు" అన్నారు. అత్తగారు ఆయన్ని వారించలేదు. 'అన్న' గారు కలుగజేసుకుని, తమ్ముని వారించినా ఆయన వినలేదు. పైగా అన్నగారిమీద విరుచుకుపడ్డారు. అన్నదమ్ము లిద్దరికి సంఘర్షణ ఏర్పడింది.

పర్యవసానంగా—పెదనాన్న ఎక్కివచ్చిన బండిలోనే తన ప్రయాణం ఖాయమయ్యింది. బతిమాల డానికి అవకాశం లేకుండాపోయింది. ఆయన ఇంట్లోంచి వెళ్ళిపోయారు. అత్తగారు పొరుగింటికి వెళ్ళిపోయింది. దారి పొడుగునా తను వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది. ఏ ముహూర్తాన్న తన జీవితంలో దుఃఖం ప్రారంభమయ్యిందో కాని, నిర్విఘ్నంగా నెలవు ఏర్పాటు చేసుకుంది.

— ఆలోచనా తరంగాల్లోంచి నిద్రాసముద్రం లోకి పోయి, మేలుకునేసరికి తొలికోడి కూసింది. "అబ్బ— రోజులెలా గడుస్తాయో—" అనుకుంటూ సుశీల గది దాటి పెరట్లోకి వచ్చింది. తిరిగి ఆమె మనస్సు తన స్థితిలోకి వెళ్ళిపోయింది.

....ఆనాడు— తన బావగారు— తన పాలిట దేముడు— ఆయనవచ్చి "కనీసం నగలు పాడుకున్నట్లు రాసిచ్చినా — తమ్ముడు ఒప్పుకుంటాడనీ ఆ మాత్రం రాసివ్వడం ఏమంత కష్టంకాదనీ— చూస్తూ చూస్తూ పండంటి కాపరం చేతులారా నాశనం చేసుకోడం మంచిదికాదనీ చెప్పారు.

ఆయన వెళ్లాక— తను, తల్లి, కొండంత సంబరం పడ్డారు. మావయ్య వచ్చి విషయం తెలుసుకునే సరిదిద్దాడు. నగలు ఎవరు వాడుకున్నారో వాళ్లే సంతకం చెయ్యాలని— చేస్తే అర్థం ఉంటుంది కాని— మధ్యలో తను రాసివ్వడం ఏమిటని— రాసివ్వనని చెప్పాడు. మాటా మాటావచ్చి మాటలు పోయాయి.

వెర్రి తల్లి— తప్పంతా నాది. వాడెంత నాకు తమ్ముడయినా—ఇలాటి వాటిల్లో ఇరుక్కునేటంత వెర్రివాడు కాదే— తప్పంతా నాది— ఎవర్ని ఏం లాభం— ఆ వెధవ చదువుకోసం నీ సుఖాన్ని, నూరేళ్ల జీవితాన్ని ఎరపెట్టి బలిపెట్టాల్సి వచ్చింది'' అంటూ తన తల్లి కంటికీ మింటికి ఏకధారగా ఏడ్చింది. ఎందరు ఎంత ఏడుస్తే మాత్రం ఏంలాభం— ఫలితం శూన్యం— మర్నాడు, మూడోనాడూ ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చి అమ్మ అన్నయ్యకి ఒక ఉత్తరం రాసింది. ఆ ఉత్తరం తెచ్చే ప్రత్యుత్తరంమీదే తన భవిష్యత్తు నిర్ణయం అయి ఉంది. కళ్లు కాయలు కాసేలాగ వారం రోజులనుంచి రోజూ జాబుకోసం ఎదురు చూస్తోంది తను.

''ఏవే సుశీలా, రాత్రంతా ఇలా పెరట్లోనే కూర్చున్నావా? నిద్రపోలేదూ'' అన్న తల్లి మాటలకు వులిక్కిపడి,'' ''లేదమ్మా— ఇప్పుడే లేచాను.'' అంది పూడిన గొంతుకతో.

రత్తమ్మగారికి కూతురు స్థితి చూసి, కడుపు తరుక్కుపోయింది. అయినా ఆవిడ చెయ్యగలిగిదేమీలేదు— కన్నీరు విడవడం తప్ప. ఆవిడ శోకం ఆగ్రహరూపం దాల్చి కొడుకుమీదికి మళ్లింది.

''ఛీ—దరిద్రుడు—నా కడుపున చెడపుట్టాడు. ఆడపిల్ల నగలమ్మి చదివిస్తే చదువుకుని, ఈనాడు చెల్లెలు పంటంటి సంసారం చెల్లాచెదరై పోతుంటే పట్నంలో సంపాదించుకుంటూ కులుకుతున్నాడు— ఛీ!'' అంది.

సుశీల కారే కన్నీటిని ఒపుకుంటూ, కారిన కన్నీటిని తుడుచుకుంటూ, ''పోనీలేమ్మా డబ్బు కోసం ప్రయత్నిస్తున్నాడేమో!'' అంది అతను అలాటి ప్రయత్నాలు చెయ్యడని దృఢంగా నమ్మకం ఉన్నా.

రత్తమ్మగారికి మాటలు వచ్చలేదు.

''డబ్బెందుకే! వెధవ డబ్బు— నగలు వాడు

కన్నీరు

కున్నట్టు కాయితంమీద రాసిస్తే చాలని వాళ్లంటే మన అదృష్టంకొద్దీ వాళ్లు— చీటీ ముక్కమీద రాసిస్తే చాలన్నారు కదా వాళ్లు— ఏం ఆ మాత్రం రాయడానికి చేతులు రాకపోయాయా! మనం జాబువేసి వారంపైన అయ్యిందికదా—ఛీఛీ'' అంది ఆవిడ.

* * *

భోజనాలయ్యాయి.

వారం పదిరోజులనుంచి జరుగుతున్న దినసరి కార్యక్రమం ప్రకారం సుశీల తన గదిలో మంచం మీద పడుకుని, గతాగతాలను ఆలోచిస్తూ, వూహిస్తూ కన్నీరు కార్చసాగింది.

—అత్తవారిల్లు— అత్తారింటికి వెళ్లాలి— వెళుతున్నాను—వెళ్లేను— అని సంబరపడ్డ కాలం పట్టలేదు. తిరిగి వచ్చెయ్యడానికి. అత్తవారింట్లో నడుచుకోవలసిన పద్ధతులూ, అత్తగారికి తనమీద మంచి భావం కలిగేలా చేసుకునే పద్ధతులు భర్త అనురాగం పొందడానికి నడుచుకోవలసిన రీతులమీద తన మనస్సు చెప్పిన పాఠాలన్నీ వ్యర్థమై పోతాయని కల్లోకూడా వూహించలేదు. తన సుఖాలన్నీ ఒక్కుమ్మడిగా చేరి, స్వల్పకాలంలోనే తనను వదిలి వెళ్లిపోయాయి. పోతూ పోతూ— తన వంటరితనాన్ని చూసి జాలిపడి, తీరని దుఃఖాన్ని తనవంటరితనానికి జంటగా పంపాయి...........

సుశీల భారంగా నిట్టూర్చి— పక్కమీంచి లేచి పెట్టె తీసి 'ఆ' ఉత్తరాన్ని తీసి మళ్లీ చదువుకుంది. అవే మాటలు, అవే ముక్కలు..........

—సంతాలు వచ్చాయి గనుక సంతాలుగానే సాగాలి. ఆనాడు మీ మావయ్య వచ్చినపుడు ఆయనలా మాట్లాడకపోతే ఇంతగోల అయ్యేదికాదు. జరిగిందేదో జరిగిపోయింది. ఈ విషయంలో అమ్మ చాలా పట్టుగా ఉంది. కానీ అన్నయ్య మంచితనం నా పంతాన్ని కరిగించింది. నిన్ను కావాలని పెళ్లిచేసుకున్నాను. నిన్ను వదిలిపెట్టి— వేరే పెళ్లి చేసుకోవాలని నాకు గనుక అభిప్రాయం ఉంటే నిన్నసలు పెళ్లిచేసుకోక పోదును అంతమాత్రంచేత— నేను తాగుబోతునని తిరుగుబోతునని, నా కెవ్వరూ పిల్లనివ్వరని— మీ మావయ్య అన్నమాటలు గుర్తుకు వచ్చినప్పుడల్లా.. పోనీలే.......అవన్నీ తవ్వడం ఎందుకు?— నగలు మీ వాళ్లు వాడుకున్నట్టు— మీ మావయ్యగానీ, మీ అన్నయ్యగానీగానీ రాసిస్తే— నువ్వు మా ఇంటికి రావడానికి మా అమ్మను ఒప్పించాను. ఈ మాటే అన్నయ్యతో మీకు కబురుపెడుతున్నాను. తొందరలో ఆ ఉత్తరం రాయించుకుని— కబురు చేయగలవనుకుంటాను— ఇదేమంత కష్టమైన పని కాదు...........

''ఇదేమంత కష్టమయిన పనికాదు''. అనుకుంది సుశీల నిస్పృహగా.

ఏమో! ఎంత ఇదైనా— తోబుట్టువు కదా! తన చెల్లెలు సంసారం నాశనమై పోతుంటే ఏ అన్నయ్య చూస్తూ వూరుకుంటాడు— అప్పుడే ఉత్తరం రాసి వారం అయ్యింది. సమాధానం తప్పక రావాలి.

ఆలోచనా తరంగాల్లో ఉన్న సుశీల 'పోస్ట్' అన్న కేకకి ఉలిక్కిపడి, 'వస్తేవచ్చే' అని కేకేసి, గదిదాటి బయటికి వచ్చింది. హాల్లో నిద్రపోతున్న రత్తమ్మగారికి ఇవేమీ భంగం కలిగించలేదు. పోస్టుమాన్ అప్పుడే కవర్ని విసిరి వెళ్లపోయాడు. సుశీల మనస్సు చివుక్కుమంది. తనజీవితాన్ని, సంసారాన్ని నిలబెట్టే ఉత్తరాన్ని అంత నిర్లక్ష్యంగా విసిరిపోతాడా అనుకుంటూ — మహాదానందంతో ఆ కవర్ని తీసుకుని, విప్పి చదవ నారంభించింది.

ఉత్తరం చాలా క్లుప్తంగా ఉంది.

''—నీ ఉత్తరం చేరింది—ఏమని సమాధానం రాయాలో ఆలోచించుకోడానికి ఇంతకాలం పట్టింది. మాటిమాటికీ చెల్లెలు నగలు వాడుకున్నానని మీరు చెప్తుతున్నారు. నేను వాడుకోలేదు. వాడమని నేను అడుగలేదు. నేను ఆనాడు చదువు సాగక, ఇంటికి వచ్చేస్తే— నువ్వూ మావయ్యా ఆలోచించి, దాని నగలు పెట్టి నన్ను చదివించారు. ఆ సంగతికూడా నాకు తెలియదు. అందులో నా ప్రమేయంలేదు— నగలిమ్మని దాన్ని నేను అడుగలేదు. నా చేతిలో తను ఏ నగా పెట్టలేదు. పైగా నగలు వాడుకున్నదేగాక, ఆ సంగతి చెప్పి, ప్రాథేయపడడానికి బదులు— గిల్టు నగలుపెట్టి— కాపరానికి పంపిన ఆ మావయ్యని రాసిమ్మను— ఒక నెక్లెసు— గాజులు ఇంకా ఏవేవో అని రాశారు. ఆమాత్రం దానికి పండంటి కాపురం నాశనం అవ్వాలని పట్టుపట్టే మొగుడితో అదెంత కాలం కాపరం చెయ్యగలదు. కుట్టుపని నేర్చుకునో, ట్రయినింగు అయ్యో జీవితం వెళ్లమార్చుకుంటే చాలు— మీ ఉత్తరం వెనక— 'అతని' అన్నగారు నాకో ఉత్తరం రాశారు. ఎడ్రసు వాళ్లకెలా తెలుసో సరి— నగలు నేనువాడుకున్నట్టు రాసిస్తే చాలట— కేసు పెట్టరట! కేసు పెట్టనికాడికి, నేను వ్రాసివ్వడం ఎందుకో, రాసిచ్చినందువల్ల వాళ్లకి వచ్చే ఫలితం ఏమిటో నాకు అర్థంకాలేదు. చూసి, చూసి ఇలాటి పద్మవ్యూహాల్లో నేను జొరవడ దల్చుకోలేదు. పైగా ఈ మధ్యనే నేను వివాహం చేసుకున్నానుకూడా. ఖర్చులు కొంచెం అధికంగా ఉన్నాయి. మానసికంగా కొంచెం 'ఇది'గాకూడా ఉంది. ఇదే విషయంమీద అయిదే ఇకముందు నాకు ఏవిధమైన ఉత్తరం రాయనవసరంలేదు...........''

ఉత్తరం సాంతం చదివిన ఆమెకళ్లు అలవాటు చొప్పున బొటబొటాకన్నీటిబొట్లను రాల్చాయి. ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

హాస్య సంచిక!

11-9-'64

వినాయక చవితి ప్రత్యేక సంచిక

హాస్య సంచికగా వెలువడుతుంది!

'హాస్యసంచిక'కు అని కవరు పైన వ్రాసిన రచనలు 21-8-'64 లోగా మా కార్యాలయానికి చేరేలాగ పంపమని కోరుతున్నాము. తతిమ్మానిబంధనలన్నీ మామూలే!